www.ghantaravam.com
epaper.ghantaravam.com

ఘంటారావమ్
దినపత్రిక
అన్యాయంపై అక్షర సమరం

సంపుటి : 17
సంచిక : 46
పేజీలు : 4
ధర : రూ.3.00

కరీంనగర్
బుధవారం 27 మే 2026

www.ghantaravam.com
నిత్యం ప్రజల పక్షాన, ప్రజల గొంతుకగా
నిలుస్తూ, నిజాలను నిర్భయంగా, వాస్తవ కథనాలను
అందించడమే ధ్యేయంగా, అన్యాయంపై అక్షర సమరం
సాగించడానికి పుట్టిందే ఘంటారావమ్ దినపత్రిక..
ఇప్పుడు.. మన పత్రిక
మీకు మరింత చేరువలో..
epaper.ghantaravam.com




# తుమ్మిడిహెట్టిపై

## మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసిన సీఎం రేవంత్

- గతంలో 148 మీటర్లకు ఓకే చెప్పిన మహారాష్ట్ర
- 150 మీటర్ల ఎత్తు పెంపునకు సీఎం ప్రతిపాదన
- చర్చలతో సాధ్యం కావచ్చని విశ్లేషకుల అంచనా

**హైదరాబాద్, ఘంటారావమ్**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ రాసి తుమ్మిడిహట్టి బ్యారేజీ ప్రాజెక్ట్‌పై అంతర్ రాష్ట్ర చర్చలు జరపాలని కోరారు. ఈ లేఖలో ప్రాజెక్టు ఎత్తును 150 మీటర్లుగా నిర్ణయించాలని, ఇది మహారాష్ట్రలో ముంపు ప్రభావాన్ని కనీస స్థాయిలో ఉంచుతుందని స్పష్టం చేశారు. టైమ్స్ ఆఫ్ ఇండియా రిపోర్టు ప్రకారం, గతంలో మహారాష్ట్ర 148 మీటర్ల ఎత్తుకు అంగీకారం తెలిపిన విషయాన్ని గుర్తు చేస్తూ, 150 మీటర్ల ఎత్తు సాధ్యమేనని సీఎం రేవంత్ లేఖలో వివరించారు.

ఈ ప్రాజెక్టు ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాలైన ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్‌లలో సాగు, తాగు నీటి అవసరాలను తీర్చవచ్చని రేవంత్ రెడ్డి లేఖలో తెలిపారు. 148 మీటర్ల ఫుల్ రిజర్వాయర్ లెవల్ సరిపోదనీ, ఉత్తర జిల్లాల అవసరాలను లెక్కలోకి తీసుకోవాలని కోరారు. తెలంగాణ ప్రతినిధులకు సమయం కేటాయించి సమావేశం ఏర్పాటు చేయాలని అభ్యర్థించారు. సియాసత్ ప్రకారం, రేవంత్ ప్రభుత్వం.. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పునరుద్ధరించి తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తోంది. గత BRS ప్రభుత్వం మేడిగడ్డ వంటి ఇతర బ్యారేజీలకు మార్చడంతో ఈ ప్రాజెక్టు వాయిదా పడింది. 150 మీటర్ల ఎత్తులో నిర్మాణం చేపట్టితే మహారాష్ట్రలో ఎక్కువ ముంపు ఉండదని, ఏవైనా ప్రభావిత ప్రాంతాలకు తెలంగాణ ప్రభుత్వం పరిహారం చెల్లించడానికి సిద్ధంగా ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇది గ్రావిటీ ఆధారంగా నీటిని శ్రీపాద ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు

మిగతా 4వ పేజీలో..

## రిజిస్ట్రేషన్ల రద్దీ తగ్గించేందుకు ప్రత్యేక చర్యలు..

**హైదరాబాద్, ఘంటారావమ్**

రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. మే 29 నుంచి జూన్ 3 వరకు అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అదనపు పని వేళలు అమలు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఉదయం 9:30 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా స్లాట్ బుకింగ్‌ల సంఖ్యను కూడా పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే మరికొన్ని రోజులు కూడా అదనపు సేవలు కొనసాగించే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియలో వేగం, పారదర్శకత పెంచడంపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయాలతో సమన్వయం పెంచి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సౌకర్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.



## అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

### నాణ్యతతో పాటు సమర్థవంతమైన అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**వరంగల్ కార్పొరేషన్, ఘంటారావమ్ :**

జిడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం ఐడీఓసీ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి వివిధ పథకాల కింద

సివిల్, ఎలక్ట్రికల్, స్వచ్ఛ భారత్ మిషన్ తదితర విభాగాలకు సంబంధించిన కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.., చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో పాటు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఈఈలు సంతోష్ బాబు, మాధవి లత, మహేందర్, డీఈలు సతీష్, కార్తీక్, రాజ్‌కుమార్, రవికిరణ్, రంగారావు తదితరులు పాల్గొన్నారు.





## దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

### హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ కలెక్టరేట్, ఘంటారావమ్ :**

రెవెన్యూ సంబంధిత దరఖాస్తులను గడువు తేదీలోగా తహసీల్దార్లు పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో భూభారతి పోర్టల్, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన, సాదా బైనామా దరఖాస్తులు, రెవెన్యూ సంబంధిత అంశాలపై ఆర్డీవో, తహసీల్దార్లతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సంబంధిత అంశాలపై తహసీల్దార్లతో కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ ఎన్. రవి సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. మండలాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఆర్ఐ రిపోర్ట్ ఆధారంగా నిబంధనల మేరకు వాటిని

మిగతా 4వ పేజీలో..

ఘంటారావమ్

జనరల్

General

బుధవారం
27 మే, 2026

www.gantaravam.com




# ఈదులకుంటను కాపాడిన హైడ్రా..

## 4వేల కోట్ల విలువైన భూమికి ఫెన్సింగ్

**శేరిలింగంపల్లి, ఘంటారావమ్ :**

ఐటీ కారిడార్‌లోని మాధాపూర్‌లో చెరువును మాయం చేయాలనే కబ్జాదారుల ప్రయత్నాలను హైడ్రా అడ్డుకుంది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్ సర్వే నంబరు 7లో ఉన్న 6.05 ఎకరాల ఈదులకుంటను కబ్జాల చెర నుంచి విడిపించింది. శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంట నిండితే వరద కాలువ ద్వారా ఈదుల కుంటకు నీరు చేరేది. ఆ కాలువను డైవర్ట్ చేయడంతో ఈదుల కుంటకు వరద నీరు చేరకుండా చేశారు. చెరువు రూపురేఖలు మార్చేసి.. హద్దులు చెరిపేసి... ఇక భవన నిర్మాణాలే ఆలస్యం అనుకున్న తరుణంలో స్థానికులు హైడ్రాను ఆశ్రయించారు. తమ్మిడికుంట - ఈదులకుంట-సున్నం చెరువులుగా గొలుసుకట్టుగా ఉన్న వాటిలో ఈదుల కుంట మాయమౌతోందని హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కూడా కేసు నమోదయ్యింది. స్థానికుల ఫిర్యాదులను క్షేత్ర స్థాయిలో పరిశీలించిన హైడ్రాకు అక్కడ చెరువు ఆనవాళ్లు కనిపించాయి. గ్రామ, రెవెన్యూ రికార్డుల మేరకు 6.05 ఎకరాల చెరువున్నట్టు నిర్ధారించుకుంది. ఇదే విషయాన్ని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ శాటిలైట్ చిత్రాలు కూడా నిర్ధారించాయి. దీంతో మంగళవారం చెరువు



హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేసింది. 6.05 ఎకరాల ఈదులకుంటకు తోడు.. ఆ పక్కనే సర్వే నంబరు 11/37లో ఉన్న 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా హైడ్రా కాపాడింది. మొత్తం 11.21 ఎకరాల భూమిని కాపాడినట్టు అయ్యింది. ఇలా మొత్తం మాధాపూర్‌లోనే దాదాపు రూ. 1800 కోట్ల విలువైన భూమిని హైడ్రా మంగళవారం కాపాడింది. ఈ భూమి చుట్టూ హద్దులు నిర్ధారించి ఫెన్సింగ్ వేస్తోంది.

**ఓవర్‌ల్యాపింగ్ పేరిట కొట్టేసే ప్రయత్నం**

రెండు మండలాల సరిహద్దుల్లో ఉండడం కబ్జాదారులకు ఈదులకుంటతో పాటు.. పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి వరంగా మారింది. కూకట్‌పల్లి మండలం, కూకట్‌పల్లి గ్రామంలో చెరువు లేందంటూ కబ్జాదారులు చూపించారు. ఇదే సమయంలో శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ విలేజ్‌లో 6.05 ఎకరాల చెరువు ఉంది. ఒకవేళ ఓవర్‌ల్యాప్ అయినా.. చెరువును ఎవరూ మార్చలేరు. ఈ వివాదాన్ని పరిష్కరించడంలో ఇరు మండలాల అధికారులు చొరవ చూపాలి. అది జాప్యం జరగడంతో ఇదే అదనుగా ఎన్‌వీఎన్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ చేతివాటం చూపించింది. ఇదే అదనుగా 6.05 చెరువుతో పాటు.. సర్వే నంబరు 11/37లో ఉన్న 5.16 ఎకరాల ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేసి నిర్మాణాలకు సిద్ధమయ్యారు. కూకట్‌పల్లి మండలం పరిధిలోకి వచ్చే సర్వే నంబరు 1003 నుంచి 1006 వరకూ ఉన్న భూమిని చూపించి 14 అంతస్తుల భవన నిర్మాణానికి సదరు సంస్థ 2022లో అనుమతులు తీసుకుంది. తప్పుడు పత్రాలతో ఇరిగేషన్ అనుమతులు కూడా యిదే ఏడాది సదరు నిర్మాణ సంస్థ తీసుకుంది. అయితే నిర్మాణాలు మాత్రం 6.05 ఎకరాల ఈదులకుంటలో చేపడుతున్నారు. ఈ మేరకు సెల్లార్ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. ఇదే విషయమై స్థానికుల ఫిర్యాదుతో హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో క్షేత్రస్థాయిలో విచారించారు. 6.05 ఎకరాల చెరువు స్థలంతో పాటు.. 5.16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్టు గుర్తించారు. ఈ మేరకు మంగళవారం మొత్తం 11.21 ఎకరాల భూమిని కాపాడుతూ ఫెన్సింగ్ వేశారు.

# అన్నారంలో అక్రమంగా మట్టి దందా

- అనుమతులు బంధువులు, స్నేహితుల పేర్ల మీద
- మట్టి అమ్మకాలు వేరే రైతులకు
- పర్మిషన్ కొంత.. తవ్వకాలు కొండంత
- ఆఫీసర్ల పర్యవేక్షణ కరువు
- అక్రమార్కులకు సహకరిస్తున్న అధికారులు



**పర్వతగిరి, ఘంటారావమ్:**

వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారంలో అక్రమ మట్టి దందా రోజురోజుకు మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. దర్గా చెరువులో నల్ల రేగడి మట్టిని స్థానిక వార్డు మెంబర్ తన బంధువులు, స్నేహితుల పేర్ల మీద సంబంధిత ఆఫీసర్లతో పర్మీషన్ తీసుకుని వేరే రైతులకు రేగడిమట్టి కాకుండా మొరాన్ని తీస్తూ అక్రమంగా అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నాడని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీనికి జిల్లా ఆఫీసర్లతో సహా స్థానిక ఆఫీసర్ల అండ దండలు ఉండడంతో అక్రమార్కుడు రెచ్చిపోతున్నాడు. సంబంధిత ఐబీ ఆఫీసర్లు పర్యవేక్షణ చేయక పోవడంతో నల్ల రేగడి మట్టి పర్మీషన్లు మొరం దందాకు తెరలేపుతున్నాయి. లొకేషన్‌లో ఏ ఒక్క ఆఫీసరు ఉండక పోవడం పై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పర్మీషన్ ప్రకారం..110 సర్వే నెంబర్ దర్గా శిఖం భూమిలో మాత్రమే మట్టిని చెరువు కట్టకు దూరంగా తీయాలి. ఇందులో నల్లరేగడి మట్టిని అనమతులు పొందిన రైతుల పొలాల్లో పోయాల్సి ఉంది. కాని ఇక్కడ ప్రైవేటు అవసరాలు, ఖాళీ ప్లాట్లలో, ఎఫ్‌టీఎల్ భూములలో, చుట్టు పక్కల గ్రామాల ఇటుక బట్టీలకు సైతం మట్టిని అక్రమార్కులు అమ్ముకుంటున్నారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే తరలించాల్సి ఉండగా అర్ధరాత్రి వరకు మట్టిని తరలిస్తున్నే ఉన్నారు. మట్టి తోలే క్రమంలో స్థానిక రెవెన్యూ, పోలీస్ వారికి సమాచారం ఇచ్చి నిర్వహించుకోవాలి. అనుమతులు ఇచ్చిన 1000 క్యూబిక్ మీటర్ల కంటే ఎక్కువ తీసుకోకుండా ఏ రోజు ఎంత పరిమాణంలో తీశారో ఇరిగేషన్ డిఈఈ నిర్ధారించాల్సి ఉంది. అనుమతులు ఇచ్చిన రోజులలో 1000 క్యూబిక్ మీటర్లు ముందుగానే పూర్తి చేస్తే మట్టి తరలింపును ఆఫీసర్లు ఆపివేయాల్సి ఉంటుంది. అంతేకాక పర్మిషన్లు ఉన్న ట్రాక్టర్లే కాకుండా ఎక్కువ ట్రాక్టర్లను పెట్టి మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మట్టి దందాపై పిర్యాదు చేసిన వారి వివరాలు ఆఫీసర్లు వెంటనే అక్రమార్కులకు చేరవేయడంతో వారిని బెదిరింపులకు గురిచేస్తూ మేము ఆఫీసర్లకు, విలేకరులకు, మాముల్లు ఇస్తున్నామని మమ్మల్ని ఎవరూ ఏమి చేయరని బాహటంగానే వారితో వాగ్వాదానికి దిగుతున్నరాని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఐబి ఆఫీసర్లు ఈనెల 26 నుంచి మట్టి తవ్వకాలకు పర్మిషన్ ఇస్తే ఈ అక్రమార్కులు ఈనెల 21 నుంచే ఇప్పటికీ వేల ట్రిప్పుల మట్టిని తరలించి అమ్ముకున్నారు. ఇప్పటికైనా మట్టి దందాను ఆపి అక్రమార్కుల పై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# పంట అవశేషాలను కాల్చవద్దు

## రైతు రక్షణ సమితి నేత హింగె భాస్కర్

**పరకాల, ఘంటారావమ్:**

"పంట వ్యర్థాలను తగులబెట్టడం వల్ల భూమి నిస్సారమవ్వడమే కాకుండా భవిష్యత్తు తరాల ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. ప్రతి గ్రామంలో దీనిపై విస్తృతంగా చాటింపు వేయించి రైతుల్లో అవగాహన కల్పించాలి" అని తెలంగాణ రైతు రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు హింగె భాస్కర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,, రైతులు పంట కోతల అనంతరం పొలాల్లో మిగిలిపోయే వరి కొయ్యలు, మొక్కజొన్న చొప్పలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అవలంబించాలని సూచించారు. "పర్యావరణాన్ని కాపాడుకుందాం -- ఆరోగ్యంగా జీవిద్దాం" అనే నినాదంతో రైతుల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. పొగ కారణంగా వాయు కాలుష్యం పెరిగి ప్రజల్లో ఊపిరితిత్తుల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. పంట వ్యర్థాలను రైతులు అధునిక పద్ధతుల్లో వినియోగించుకోవాలని, హార్వెస్టర్ల ద్వారా పొడి చేసి భూమిలో



కలియదున్నడం, కంపోస్ట్ ఎరువుగా తయారు చేయడం, మల్చింగ్ విధానంలో నేల తేమను కాపాడడం, పుట్టగొడుగుల పెంపకానికి వరి గడ్డిని వినియోగించడం వంటి మార్గాలను వివరించారు. అధికారులు, రైతు సంఘాలు, గ్రామస్థులు కలిసి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. "మన గ్రామం -- మన బాధ్యత... మన భవిష్యత్తు మన చేతుల్లోనే ఉంది" అని పేర్కొంటూ ఉమ్మడి జిల్లాలోని రైతాంగం మొత్తం పర్యావరణ పరిరక్షణకు ముందుకు రావాలని భాస్కర్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వల్బాపూర్ క్లస్టర్ ఏఈఓ బాబు శ్రీధర్ రావు రవీందర్ రావు, మొగిలి, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

# స్లీపర్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు ధర్నా

- పనుల నుంచి తొలగించారని ఆవేదన
- ఎమ్మెల్యే చొరవతో దిగివచ్చిన యజమాన్యం

**హసన్‌పర్తి, ఘంటారావమ్:**

హసన్‌పర్తి మండలం ఎల్లాపూర్ గ్రామంలో స్లీపర్ ఫ్యాక్టరీలో గత కొన్ని సంవత్సరాల నుండి స్థానిక ఉద్యోగులు పనిచేస్తుండగా కొత్తగా కంపెనీకి తెలంగాణ వాసి జీఎంగా వచ్చి స్థానిక ఉద్యోగులను తొలగించి ఒరిస్సా నుండి కార్మికులను తీసుకువచ్చి వారికి పని కల్పించినారు, ఎల్లాపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నేదునూరి సునీల్ ఆధ్వర్యంలో స్లీపర్ ఫ్యాక్టరీ మెయిన్ గేటు వద్ద తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని కార్మిక హక్కులను కాపాడాలని ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు సమస్యపై స్పందించి వెంటనే చొరవ తీసుకోవడంతో కంపెనీ యాజమాన్యం దిగివచ్చి తొలగించిన కార్మికులను తిరిగి పనిలోకి తీసుకుంటామని హామీ ఇచ్చారు, ఈ సమస్యపై వెంటనే



స్పందించి పరిష్కరించిన ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు కు మండల స్థానిక కాంగ్రెస్ నాయకులకు కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు,ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, మాజీ మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, ఎర్ర ప్రకాష్, జరిగే రవి, వీరబోయిన తిరుపతి కార్మికులు పాల్గొన్నారు.



# సెంట్రింగ్ కార్మికుల ఆందోళన

## మేస్త్రీల వ్యవస్థ రద్దు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

**మల్కాజిగిరి, ఘంటారావమ్:**

సెంట్రింగ్ కార్మికులు తమకు సరైన వేతనాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ సఫిల్గుడా చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ నిరసనలో పలువురు కార్మికులు పాల్గొన్నారు. ఓనర్లు, కాంట్రాక్టర్ల మధ్య మేస్త్రీల జోక్యం పెరగడంతో తమ కష్టానికి తగిన ప్రతిఫలం అందడం లేదని తెలిపారు. ఈ పరిస్థితుల వల్ల అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని చెప్పారు.నేరేడ్‌పేట్-మల్కాజిగిరి సెంట్రింగ్ అసోసియేషన్ కోశాధికారి అశోక్ మాట్లాడుతూ, సెంట్రింగ్ కార్మికుల హక్కులను ప్రభుత్వం పరిరక్షించాలని కోరారు. మధ్యవర్తుల వ్యవస్థను తొలగించి కార్మికులకు నేరుగా చెల్లింపులు జరిగే విధానం తీసుకురావాలని సూచించారు. నిర్మాణరంగ కార్మికులకు ఆరోగ్య బీమా, భద్రతా పథకాలు, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.



# వ్యాపారంలో అభివృద్ధి చెందాలి

## మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

**నడికూడ, ఘంటారావమ్:**

నడికూడ మండల కేంద్రంలో స్థానిక గ్రామానికి చెందిన తూముల పరుశురాం నూతనంగా ఏర్పాటు చేసిన సెలూన్ షాప్‌ను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా షాప్ యజమానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ కష్టించి పనిచేసుకుంటూ, పలువురికి ఆదర్శంగా నిలవాలని వ్యాపారంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.



# ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

**వీణవంక, ఘంటారావమ్ :**

మండలంలోని నర్సింగాపూర్ చెరువులో పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు కాంగ్రెస్ నాయకులు, అతిథి బిల్డర్ కొమ్మిడి రాకేష్‌రెడ్డి ప్రధాన అనుచరుడు బోయిని విద్యాసాగర్ కూతురు ఆరాధ్య పుట్టినరోజు సందర్భంగా బుధవారం మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి దృష్ట్యా ఆరోగ్య నియమాలు పాటించాలని సూచించారు. తప్పనిసరి అయితేనే బయటకు వెళ్లాలని పేర్కొన్నారు.



# రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

## మాదారం పాక్స్ చైర్మన్ నల్లెల్ల

**నడికూడ, ఘంటారావమ్:**

నడికూడలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్న మాదారం పాక్స్ చైర్మన్ నల్లెల్ల లింగమూర్తి. ఎండల, వర్షం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. లింగమూర్తి వెంట మాజీ మార్కెట్ చైర్మన్ నిప్పని సత్యనారాయణ,సెంటర్ ఇంచార్జి నవీన్ తదితరులు పాల్గొన్నారు.



# మృతుడి కుటుంబానికి అండగా బెజ్జంకి పూర్ణాచారి

**పరకాల, ఘంటారావమ్:**

శాయంపేట మండలం కొప్పుల గ్రామానికి చెందిన అలువాల రాజుకు పక్షవాతం. తర్వాత కోమాలోకి వెళ్లాడు. ఆరోగ్యం క్షీణించి ఇటీవల చనిపోయాడు. అతని కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడుతోంది. అమ్మ అశోక్ ద్వారా ఈవిషయం 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి తెలుసుకున్నారు. రాజు కుటుంబానికి 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందేలా చేశారు. ఈ సందర్భంగా రాజు కుటుంబ సభ్యులు బెజ్జంకి పూర్ణాచారికి కృతజ్ఞతలు తెలిపారు.

# తాటిచెట్టు పైనుండి పడిన గీతన్నకు గాయాలు

**పరకాల, ఘంటారావమ్:**



పరకాల మండలం కామారెడ్డిపల్లికి చెందిన గీత కార్మికుడు బండి రమేష్ (38) మంగళవారం సాయంత్రం తాటి చెట్టు ఎక్కుతున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతని కాలు విరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికులు వెంటనే రమేష్‌ను పరకాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రమేష్ కుటుంబ పోషణ అతనిపైనే ఆధారపడి ఉందని గీత కార్మికులు తెలిపారు.గాయపడిన రమేష్‌కు ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.



# మృతుల కుటుంబాలకు చల్లా పరామర్శ

**ఆత్మకూరు, ఘంటారావమ్ :**

హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం గూడెప్పాడ్, ఆత్మకూరు, హౌస్ బుజుర్గ్ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు.మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు.గూడెప్పాడ్ లో వడదెబ్బతో మృతిచెందిన ఎలుకటి మొగిలి కుటుంబాన్ని, ఆత్మకూరులో వీర్ల హారిక కుటుంబాన్ని పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న బిఆర్ఎస్ నాయకులు కొమ్ము కుమారస్వామిని కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. హౌస్‌బుజుర్గ్ గ్రామంలో మృతిచెందిన బిఆర్ఎస్ నాయకులు షేక్‌హుస్సేన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, కాంతాల కేశవరెడ్డి,సావురే రాజేశ్వరరావు,భాష బోయిన పైడి,పాపని రవీందర్, వార్డ్ మెంబర్ రవి, ఎండి అంకుస్, రేవూరి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



# పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించను

**జీడబ్ల్యూఎంసీ సిబ్బందికి స్పెషల్ ఆఫీసర్ చాహత్‌జీ హెచ్చరిక**

- హన్మకొండలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన ప్రత్యేకాధికారి
- తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించాల్సిందేనని వార్నింగ్
- ఊర చెరువు రిటైనింగ్ వాల్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశం







**వరంగల్ కార్పొరేషన్, ఘంటారావమ్ :**

వరంగల్ మహానగర పాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్, హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సందర్శించి అభివృద్ధి పనుల పురోగతి, పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ముందుగా గోపాలపూర్ ఊర చెరువు వద్ద ఇరిగేషన్ శాఖ అధ్వ ర్యంలో నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్ పనులను పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఊర చెరువు డీసిల్టేషన్ టెండర్లు పూర్తయిన నేపథ్యంలో వెంటనే పనులు ప్రారంభించి, వర్షాకాలం ప్రారంభానికి ముందే చెరువును పూర్తిస్థాయిలో శుభ్రపరచాలని సూచించారు. అదేవిధంగా 56వ డివిజన్‌లోని గోపాలపూర్ ఊర చెరువు సమీపంలో "వేస్ట్ టు ఆర్ట్" కార్యక్రమంలో భాగంగా చెత్త వేస్తున్న ప్రాంతాన్ని పరిశీలించారు. చెత్త లేకుండా పరిశుభ్రంగా, సుందరీకరణతో తీర్చిదిద్దిన ప్రాంతాలను పరిశీలించి నిర్వహణను మరింత మెరుగుపరచాలని సూచించారు. అనంతరం 53వ డివిజన్ ఆదర్శ నగర్‌లో విండో కంపోస్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. బాలసముద్రంలో ఉన్న వెహికిల్ షెడ్, సెకండరీ ట్రాన్స్‌ఫర్ స్టేషన్లను తనిఖీ చేశారు. డోర్ టు డోర్ చెత్త సేకరణలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం తగిన స్థాయిలో జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఇంటి వద్ద తప్పనిసరిగా తడి-పొడి చెత్త వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత జవాన్లు, ఇన్‌స్పెక్టర్లపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. బాలసముద్రంలోని వర్మీ కంపోస్టింగ్ యూనిట్, విండో కంపోస్ట్, బయో కంపోస్ట్ యూనిట్లను పరిశీలించిన కలెక్టర్, బయో కంపోస్ట్ యూనిట్లు 100 శాతం సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బయో మీథనైజేషన్ ప్లాంట్‌ను కూడా సమర్థవంతంగా వినియోగించుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో సీఎంఓహెచ్ డాక్టర్ రాజారెడ్డి,జిల్లా ఇరిగేషన్ అధికారి కిరణ్ కుమార్, డీఈ హర్ష వర్ధన్, సూపర్వైజర్ నరేందర్, ఎస్సై భాషా నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప సొసైటీలో అక్రమ నిర్మాణాలు

**స్టిల్ ప్లస్ 7 అంతస్తుల భవనంపై ఆరోపణలు**

**శేరిలింగంపల్లి, ఘంటారావమ్ :**

కూకట్పల్లి జోన్ పరిధిలో మాదాపూర్ సర్కిల్ 50 పరిధిలోని అయ్యప్ప సొసైటీ, ప్లాట్ నెంబర్ 218లో ఎలాంటి అనుమతులు లేకుండానే స్టిల్ ప్లస్ 7 అంతస్తుల భారీ నిర్మాణం కొనసాగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ నిబంధనలను పూర్తిగా విస్మరించి పనులు జరుగుతున్నప్పటికీ మాదాపూర్ సీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని విమర్శిస్తున్నారు. అయ్యప్ప సొసైటీ ప్రాంతంలో గత కొంతకాలంగా అనుమతులు లేకుండా భారీ భవనాలు నిర్మించడం సాధారణంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ స్పందించి అక్రమ నిర్మాణంపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలి

**శంకరపట్నం, ఘంటారావమ్ :**

మహిళా సంఘాలకు సేవలందిస్తున్న గ్రామ వివో ఏలకు శ్రమకు తగ్గ వేతనాన్ని అందించేందుకు కృషి చేయాలని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి బుధవారం శంకరపట్నం మండలం, వివోఏలు వినతి పత్రాన్ని అందజేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వరంగల్ పర్యటనకు వెళుతన్న సందర్భంగా మార్గమధ్యంలోని కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రంలో ఐకెపి అధ్వర్యంలో మహిళా సంఘాలకు సేవలందించే గ్రామ వివో ఏల సమస్యలు పరిష్కరించాలని ఓ వినతి పత్రాన్ని అందజేశారు.

# బక్రీద్ ప్రశాంతంగా జరుపుకోవాలి

**ఈస్ట్‌జోన్ డిసిపి అంకిత్‌కుమార్**






ఐకెపి సెంటర్ పరిశీలించిన డిసిపి.

**నర్సంపేట, ఘంటారావమ్:**

బక్రీద్ పండుగను అందరూ శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎలాంటి ప్రోద్బలలకు లోను కాకూడదని ఈస్ట్ జోన్ డిసిపి అంకిత్ కుమార్ సూచించడం జరిగింది. నర్సంపేట పోలీస్ స్టేషన్లో ముస్లిం మత పెద్దలతో రేపటి బక్రీద్ పండుగ నేపథ్యంలో పీస్ కమిటీ మీటింగ్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా డిసిపి మాట్లా డుతూ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు.

నర్సంపేట గ్రేన్ మార్కెట్, లక్నేపల్లి ఐకెపి సెంటర్‌ను సందర్శించి మొక్కజొన్న, వరి కొనుగోలు వేగవంతం చేయాలని వేగవంతం చేయాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని డిసిపి ఆదేశించడం జరిగింది. కార్యక్రమంలో నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, నర్సంపేట ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, దుగ్గొండి సిఐ సాయి రామన్న ,నల్లబెల్లి, ఖానాపూర్, నర్సంపేట ఎస్సైలు పాల్గొనడం జరిగింది.

# బీఆర్ఎస్ సభ్యత్వాలను సక్సెస్ చేయాలి

**పార్టీ శ్రేణులకు హరీశ్‌రావు పిలుపు**



**ఘంటారావమ్ డెస్క్:**

ఉమ్మడి మెదక్ జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని విజయవంతం చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఒకరికొకరు పూర్తి సహకారం అందించుకుంటూ సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. నియోజకవర్గాల వారీగా నియమితులైన సమన్వయకర్తలు స్థానిక నాయకత్వంతో మమేకమై, ప్రణాళికాబద్ధంగా పని చేయాలని సూచించారు. ప్రతీ ఒక్క నాయకుడు, కార్యకర్త కొంత సమయం కేటాయించి గ్రామ స్థాయి నుంచి పార్టీబలోపేతానికి చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈ సారి సాధారణ సభ్యత్వానికి రూ.10, క్రియాశీలక సభ్యత్వానికి రూ.50 రుసుముగా నిర్ణయించినట్లు తెలిపారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను పార్టీ పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో చేపడుతోంది. స్పాట్‌లో లైవ్ ఫోటో తీసుకోవడంతోపాటు ఓటరు వివరాలు కూడా అక్కడే నమోదవుతాయి. దీని ద్వారా మెంబర్‌షిప్ డ్రైవ్ అత్యంత పారదర్శకంగా జరుగుతుందన్నారు. క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా ఈ మెంబర్‌షిప్ డ్రైవ్ పూర్తి చేస్తే.. అది రాబోయే ఎన్నికల్లో పార్టీకి ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

**వచ్చే ఎన్నికల్లో పదికి పది..**

ఉమ్మడి మెదక్ జిల్లాలో మనం ఇప్పటికే 7 స్థానాలు గెలుచుకున్నామని, వచ్చే ఎన్నికల్లో పదికి పది స్థానాలు సాధించేలా ఇప్పటి నుంచే పునాదులు వేయాలని హరీశ్ రావు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటం, గ్రామాల్లో వడ్ల కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగుతున్నందున.. రైతులు, కార్యకర్తలకు ఇబ్బంది లేకుండా జూన్‌లో సభ్యత్వ నమోదు శిక్షణా కార్యక్రమాలను ప్రారంభిద్దామని చెప్పారు. ఆన్‌లైన్ నమోదు విధానంపై పూర్తి స్థాయి అవగాహన కల్పించేందుకు ప్రతి నియోజకవర్గ కేంద్రంలో ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ మెంబర్‌షిప్ డ్రైవ్ 100 శాతం విజయవంతం కావడానికి స్థానిక ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సూచించారు.

# హైదరాబాద్‌కు హవాలా డబ్బు!

**పట్టుకున్న రైల్వే పోలీసులు**

**ఘంటారావమ్ డెస్క్:**

ముంబాయి నుంచి సికింద్రాబాద్‌కు తరలిస్తున్న భారీ హవాలా డబ్బును రైల్వే పోలీసులు పట్టుకున్నారు. సుమారు కోటి 22 లక్షల 70 వేల నగదును పట్టుకుని ఒకరిని అరెస్టు చేశారు. మంగళవారం మధ్యాహ్నం ముంబాయి నుంచి వచ్చిన దేవగిరి ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి మహారాష్ట్రలోని అమరావతి జిల్లాకు చెందిన విజయ అంబాదాస్ గుప్తా అనే వ్యక్తి బొల్లారం, మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో దిగాడు. పరిసర ప్రాంతాల్లో తిరుగుతుండగా రైల్వే పోలీసులు అనుమానంతో అతని వద్ద ఉన్న బ్యాగ్‌ను తనిఖీ చేశారు. ఆ బ్యాగ్‌లో భారీగా నగదు ఉండడంతో అతన్ని లోతుగా విచారించగా నగదు వివరాలను బయట పెట్టాడని రైల్వే పోలీసులు వెల్లడించారు. ఈ నగదును సికింద్రాబాద్ మోండా మార్కెట్లో జువెల్లరీ షాప్ నడుపుతున్న బంటీ అనే వ్యక్తికి చేరవేయడానికి వచ్చాడని వివరించారు. ఇందుకు ప్రతిఫలంగా విజయ అంబదాస్ గుప్తాకు రూ.5వేలు ఇస్తామని ఇరువురు మధ్య ఒప్పందం చేసుకున్నారని వెల్లడించారు. హవాలా డబ్బును పట్టుకున్న పోలీసు సిబ్బందిని రైల్వే పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

## పేదలకు పూర్తిస్థాయిలో వైద్యం

**ఘంటారావమ్ డెస్క్:**

పేదలకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర హెల్త్ డైరక్టర్ రవీందర్‌నాయక్ అన్నారు. బుధవారం కారేపల్లి పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో సౌకర్యాలు, రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది విధుల గురించి వైద్యాధికారి డాక్టర్ బి.సురేష్ ను అడిగి తెలుసుకున్నారు. పీహెచ్‌సీ అప్‌గ్రేడ్, అందుబాటులో ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్న పలువురి విజ్ఞప్తిపై స్పందించిన హెల్త్ డైరక్టర్ జిల్లా, రాష్ట్ర అధికారులతో చర్చించి కారేపల్లి పీహెచ్‌సీలో సేవల కల్పనకు కృషి చేస్తానన్నారు. అధిక ఉష్ణోగ్రతలతో వడదెబ్బ బారిన అనేకమంది పడుతున్నారన్నారు. వడదెబ్బకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని తప్పని పరిస్థితిలో మాత్రమే ఎండ నుండి రక్షణగా ఉండే దుస్తులు ధరించి బయటకు రావాలని సూచించారు.



## అండగా ఉంటా : చల్లా ధర్మారెడ్డి

**నడికూడ, ఘంటరావమ్:**

నడికూడ మండలం నర్సక్కపల్లి, నడికూడ,చౌటుపర్తి గ్రామాలలో ఇటీవల మృతిచెందిన బండి రాజయ్య,గడ్డం సత్తయ్య, సురావు ప్రవీణ్, నారగాని సుగుణ ,ల్యాదేళ్ళ సమ్మయ్య కుటుంబాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు.



## మృతుల కుటుంబాలకు సోదా రామకృష్ణ పరామర్శ

**పరకాల, ఘంటారావమ్:**

పరకాల పట్టణ కాంగ్రెస్ సమన్వయకమిటీ సభ్యులు, మాజీ మున్సిపల్ చైర్మన్ సోదా అనిత రామకృష్ణ పట్టణంలోని పలు కుటుంబాలను పరామర్శించారు. పట్టణంలోని 12వ వార్డుకు చెందిన బండి రమేష్ గౌడ్, కృష్ణ, చంద్రమౌళి తల్లిదండ్రులు నర్సయ్య గౌడ్, లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. 20వ వార్డులో తెప్ప కన్నయ్య తల్లి లక్ష్మి మృతిపై కూడా సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు మార్క రఘుపతి గౌడ్, బండి కుమార్‌గౌడ్, నాయకులు మునిగంటి విష్ణువర్ధన్, బొచ్చు జెమిని పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి బియ్యం అందజేత

**వీణవంక, ఘంటారావమ్ :**



మండలంలోని బేతిగల్ గ్రామానికిచెందిన గొట్టే రజిత ఇటీవల మృతి చెందారు. ఈ విషయాన్ని సీనియర్ జర్నలిస్ట్ పాపారావు ద్వారా మల్లన్నపల్లి సర్పంచ్ కలకొండ సరోజన-మధుకర్‌రెడ్డి దంపతుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే సర్పంచ్ దంపతులు మానవత్వంతో క్వింటా బియ్యాన్ని అందజేశారు. అపదలో ఉన్న కుటుంబానికి సహాయం అందించిన సర్పంచ్‌ని స్థానికులు అభినందించారు.

## పోక్సో కేసులో దోషికి ఏడేళ్ల జైలు

**ఘంటారావమ్ డెస్క్:**

ఐదేళ్ల బాలికను మాయమాటలతో ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి ఒడిగట్టిన నిందితుడికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.50వేల జరిమానా విధిస్తూ ఖమ్మం మొదటి అదనపు జిల్లా అండ్ సెషన్స్ జడ్జి బి.శ్రీనివాసరావు బుధవారం తీర్పు వెల్లడించారని ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2023 మే 28న నిందితుడైన ఖమ్మం రూరల్ మండలానికి చెందిన బోయినపల్లి వీరబాబు బాలికను బలవంతంగా ఇంట్లోకి తీసుకెళ్లాడు. టీవీ సౌండ్ ఎక్కువ పెట్టి లైంగిక దాడికి పాల్పడినట్లు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదుతో ఖమ్మం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పోక్సో చట్టం, 2012 కింద కేసు నమోదు చేసిన అనంతరం విచారణ, సాక్ష్యాధారాల సేకరణ వేగవంతంగా పూర్తిచేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశామని తెలిపారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలు, వైద్య నివేదికను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడిపై మోపిన నేరం రుజువు కావడంతో తీర్పువెలువరించారు.

# బీజేపీ నాయకులు సిగ్గులేకుండా తిరుగుతున్నారు

**ఘంటారావమ్ డెస్క్**





మహిళలను ఆర్థికంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేయాలి, మహిళా సంఘాలను బలోపేతం చేయాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రఘునాథపల్లి మండలం అశ్వరావుపల్లి గ్రామంలో జిల్లా మహిళా సమాఖ్య, మండల మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో 3కోట్ల రూపాయలతో 1మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శంకుస్థాపన చేశారు. ఈ సందర్బంగా మహిళా సమాఖ్య సభ్యులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కడియం శ్రీహరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు అనేక ప్రోత్సాహకాలు ఇస్తూ వారికి ఉపాధి అవకాశలు కల్పించడంతో పాటు వాళ్లే పది మందికి ఉపాధి కల్పించే దిశగా ముందుకు తీసుకుసెల్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే మహిళా సంఘాలకు ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ బంకులు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇవ్వడంతో పాటు అనేక పారిశ్రామిక రంగాలలో ప్రాతినిధ్యం కల్పిస్తుందని వెల్లడించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను కూడా మహిళల పేరు మీదనే తీసుకువస్తుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళల పేరు మీదనే రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇవ్వడం తో పాటు కొత్తగా ఇవ్వనున్న 2లక్షల పెన్షన్లలో కూడా మహిళకే మొదటి ప్రాధాన్యత కల్పించనున్నట్లు తెలిపారు.

అశ్వరావుపల్లి లో 2కోట్ల 90లక్షలతో ఏర్పాటు చేస్తున్న 1మెగా వాట్ సోలార్ పవర్ ప్లాంట్ 20ఏళ్ల వరకు పని చేస్తుందని తెలిపారు. దీని ద్వారా జిల్లా మరియు మండల సమాఖ్య లకు నెలకు 4లక్షల రూపాయల ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. ఇప్పటికి రఘునాథపల్లి మండల సమాఖ్యకు ఆర్టీసీ బస్సు ద్వారా నెలకు 70వేల రూపాయల ఆదాయం వస్తుందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని, ఆర్థికంగా బలపడడమే కాకుండా 10మందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. జనగామ జిల్లాలో జిల్లా కలెక్టర్ ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టబోతున్నట్లు తెలిపారు. ఈ వర్షాకాలం నుండే జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువుల దుకాణాలు ఏర్పాటు చేయబోతున్నట్లు వెల్లడించారు.

రైతుల పక్షాన నిలబడే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు. 3,4రోజులలో ధాన్యం కొనుగోలును పూర్తి చేసి యుద్ధ ప్రాతిపతికన ధాన్యం మిల్లులకు తరలించాలని కలెక్టర్ గారికి సూచించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో దేవాదుల ద్వారా ప్రతీ ఎకరానికిసాగు నీరు అందించే ప్రయత్నం చేశామని దింతో నియోజకవర్గంలో సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు గణనీయమైన దిగుబడి కూడా పెరిగిందని అన్నారు. ధాన్యం కొనుగోలులో కొంత ఇబ్బందులు ఎదురయ్యాయని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచుల కొరత, హమాలీల కొరత, మిల్లలో స్థలం లేకపోవడం వల్ల సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. ఇప్పుడు ఈ సమస్యలన్నింటిని పరిష్కరించినట్లు రైతులు పరిస్థితిని అర్థం చేసుకొని సహకరించాలని కోరారు. రైతులు పండించిన చివరి గింజ వరకు ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణ దాన్యాన్ని కొనుగోలు చేసేందుకు కేంద్రం ముందుకు రావడం లేదని అన్నారు. కానీ తెలంగాణ బీజేపీ నాయకులు మాత్రం సిగ్గులేకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తమాషాలు చేస్తున్నారని విమర్శించారు. నిజంగా రైతులపై ప్రేమ ఉంటే మోడీని ధాన్యం కొనుగోలు చేసే విధంగా ఒప్పించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, డిఆర్ డిఎ పీడీ నూరోద్దీన్, స్థానిక సర్పంచ్ చైతన్య రాజు, మండల సమాఖ్య అధ్యక్షురాలు వసంత, విద్యుత్ శాఖ అధికారులు, మెప్మా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ఇతర అధికారులు, వివిధ గ్రామాల సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణతో లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలి

## హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ, ఘంటారావమ్:**



నిరుద్యోగ యువత ఉద్యోగ సాధనలో ఎస్సీ స్టడీ సర్కిల్ ఒక బలమైన వేదికగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. బుధవారం వడ్డేపల్లి సమీపంలోని ఉమ్మడి వరంగల్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌ను జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత శిక్షణ పొందుతున్న విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. స్టడీ సర్కిల్‌లో అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, గతంలో వివిధ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థుల వివరాలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. ఇక్కడ చేరిన ప్రతి విద్యార్థి స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తూ విజయాన్ని సాధించాలని సూచించారు. పేద నిరుద్యోగ యువతకు నాణ్యమైన, ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉచిత శిక్షణ అందించి పోటీ పరీక్షల్లో విజేతలుగా తీర్చిదిద్దడమే ఎస్సీ స్టడీ సర్కిల్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. డిగ్రీ పూర్తి చేసి వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు స్టడీ సర్కిళ్లు అన్ని విధాలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రభుత్వ ఉద్యోగాల సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తులో ఉన్నత అధికారులుగా ఎదిగే అవకాశాన్ని వదులుకోకుండా క్రమశిక్షణతో చదువుతూ లక్ష్య సాధనకు కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని, ప్రభుత్వం అందిస్తున్న ఉచిత శిక్షణా అవకాశాలను పూర్తిస్థాయిలో వినియోగించుకొని తమ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ హనుమకొండ జిల్లా అధికారి బి. నిర్మల, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కె. జగన్మోహన్, వార్డెన్ కృష్ణ, కనకరాజు, బి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# శాంతియుత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

## సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత

**వరంగల్ కమిషనరేట్, ఘంటారావమ్ :**



శాంతియుత వాతావరణంలో పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ కవిత తెలిపారు. బక్రీద్ పండుగ సందర్భంగా బుధవారం వరంగల్ కమిషనరేట్ కార్యాలయంలో మత పెద్దలతో పీస్ కమిటీ మీటింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రశాంతంగా పండగలను ప్రతి ఒక్కరూ జరుపుకోవాలని డీసీపీ ఆకాంక్షించారు. ప్రజలంతా పండుగలను మత సామరస్యంతో జరుపుకునే విధంగా ఆయా మతాల పెద్దలు ప్రజల్లో సమన్వయం ఏర్పడేలా చేయాలన్నారు. పండుగ ఏ మతానిది అయినా సామరస్యత చాలా మంచి సంబంధాలను పెంపొందిస్తుందన్నారు. బక్రీద్ పండుగ సందర్బంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుం డా శాంతియుత వాతావరణంలో జరిగేలా మత పెద్దలు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని, ఎవరైనా గొడవలు సృష్టించేలా వ్యవహరిస్తే వెంటనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కాజీపేట, హన్మకొండ ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, నర్సింహారావుతో పాటు సెంట్రల్ జోన్ పరిధిలోని ఇన్స్ స్పెక్టర్లు అన్ని మతాల పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తుమ్మిడిహట్టిపై ఫోకస్

**మొదటి పేజీ తరువాయి**

తరలించడానికి వీలు కల్పిస్తుంది, ఖర్చు తగ్గుతుంది. ఈ విషయంపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సహాయం కోరుతూ ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ఆదేశాలు ఇచ్చారు.


ప్రాజెక్టు ద్వారా ఆదిలాబాద్ ప్రాంతంలో 1.5 నుంచి 2 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించవచ్చని అంచనా. ఇది ఉత్తర తెలంగాణ మెట్ట ప్రాంతాల అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుంది. రేవంత్ ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీకి కూడా లేఖ రాసి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించడంలో సహాయం కోరింది. ఫడ్నవీస్ నుంచి సానుకూల స్పందన వస్తే త్వరలో సమావేశం జరిగే అవకాశం ఉంది. ఈ అంతర్ రాష్ట్ర సమస్య పరిష్కారం తెలంగాణ రైతుల ఆశలను నెరవేరుస్తుంది.

తుమ్మిడిహట్టి ప్రాజెక్టు ప్రాణహిత-చేవెళ్ల పథకంలో కీలక భాగం. గతంలో 152 మీటర్ల ఎత్తు ప్రతిపాదించగా, మహారాష్ట్ర 148 మీటర్లకు మాత్రమే అంగీకరించింది. రేవంత్ ప్రభుత్వం 150 మీటర్లను సమస్యాత్మక పరిష్కారంగా చూస్తోంది. ఇది రెండు రాష్ట్రాల మధ్య సమన్వయానికి ఉదాహరణగా నిలుస్తుందని రాజకీయ విశ్లేషణలున్నాయి. తెలంగాణ ప్రభుత్వం జియో టెస్టింగ్, ఇతర సాంకేతిక అంశాలపై కూడా వేగం పెంచింది.

ఈ అభివృద్ధి తెలంగాణ రైతులు, ముఖ్యంగా ఉత్తర జిల్లాల ప్రజలకు ఆశాకిరణం. మహారాష్ట్ర నుంచి సానుకూల స్పందన వచ్చే వరకు చర్చలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. మొత్తానికి ఈ ప్రయత్నం సఫలం అవ్వాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారు.

# దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

**మొదటి పేజీ తరువాయి**



పరిష్కరించాలని అన్నారు. సాదా బైనామా దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని తహసీల్దార్లకు సూచించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన, సాదాబైనామా దరఖాస్తులను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రెవెన్యూ సంబంధిత దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో పరకాల ఆర్డీవో డీఎస్. వెంకన్న, వివిధ మండలాల తహసీల్దార్లు, నాయబ్ తహసీల్దార్లు పాల్గొన్నారు.





# సమర్థవంతంగా విధులు నిర్వహించాలి

**వరంగల్ కమిషనరేట్, ఘంటారావమ్ :**

అప్పగించిన పనులను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని సీపీ సన్ ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. సీసీఎస్, టాస్క్‌ఫోర్స్ విభాగాల్లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఇన్‌స్పెక్టర్లు దేవేందర్, హరికృష్ణ సీపీని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పోలీస్ శాఖ కీర్తిప్రతిష్టలు అధికారుల పనితీరుపైనే ఆధారపడి ఉంటాయన్నారు. విధి నిర్వహణలో ప్రతిఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.








# రహదారి పైన అక్రమ నిర్మాణాల తొలగింపు

**వరంగల్ కార్పొరేషన్, ఘంటారావంమ్ :**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) కమిషనర్ ఆదేశాల మేరకు వరంగల్ పోస్టాఫీస్ సమీపంలోని మున్సిపల్ భూమి ప్రధాన రహదారిపై ఉన్న ఆక్రమణలను టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు తొలగించారు. వరంగల్ పోస్టాఫీస్ పక్కన ఉన్న మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలను తొలగించడంతో పాటు, ప్రధాన రహదారికి ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న దుకాణాలు, ఇతర ఆక్రమణలను కూడా అధికారులు తొలగించారు. గత కొన్ని నెలలుగా ఈ ఆక్రమణల కారణంగా వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్న నేపథ్యంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు సిటీ ప్లానర్ రవీందర్ తెలిపారు.

పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ, డిఆర్ఎఫ్ సిబ్బంది సహకారంతో ఈ చర్యలు చేపట్టారు. అక్రమ ఆక్రమణల తొలగింపు అనంతరం ఖాళీ అయిన మున్సిపల్ స్థలాన్ని పార్కింగ్ అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఆ స్థలాన్ని ఇతర అవసరాలకు వినియోగించకుండా నిరంతరం పర్యవేక్షణ చేపట్టి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



# జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఆర్డీవో

**హనుమకొండ కలెక్టరేట్, ఘంటారావమ్ :**

హనుమకొండ జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్ బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయిని కలెక్టరేట్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ములుగు ఆర్డీవోగా విధులు నిర్వహించిన వెంకటేష్ బదిలీపై హనుమకొండ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేష్‌కు కార్యాలయ ఉద్యోగులు, అధికారులు, శుభాకాంక్షలు తెలిపారు.







Edited, Printed, Published and Owned by Bollepelly Kishan, Printed at Sathyanarayana Printers, H.No 28-5-474/3, Reddypuram, Sai Krupa Colony, - 506001, Hanumakonda Dist. Telangana State. Published at H.No. 10-3-488, OPP : RTC Workshop, Karimnagar- 505001, Karimnagar Dist. Telangana State. Editor : Bollepelly Kishan, RNI No : APTEL/2009/28812, Cell: 8978392904, Email: journalistkishan@gmail.com